క్లుప్తంగా

రీయింబర్స్‌మెంట్‌లో కోతలు విధించొద్దు


రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

జన్నారం: రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లలో కోత విధించే ఆలోచన మానుకోవాలని తెలంగాణ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గొల్లపెల్లి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి రాస్తారోకో చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు 50శాతం మార్కులతో ఉత్తీర్ణత, 75 శాతం హాజరు వంటి నిబంధనలు విధించడం సరికాదన్నారు. టీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న సామ్రాట్

భీమారం: మండల కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను శుక్రవారం ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్ తనిఖీ చేశారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు సేవలు అందించేందుకు ప్రభుత్వం 108 కేటాయించిందన్నారు జిల్లా నిర్వహణ అధికారి సంపత్, ఈఎంటీ శ్రీనివాస్, పైలెట్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

దండేపల్లి: సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ ఒకటిన పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు కొండు జనార్దన్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావనవేని రవి, మల్యాల మల్లేశ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్లను దండేపల్లి ఎమ్మార్సీ కార్యాలయం వద్ద శుక్రవారం విడుదల చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మనోహర్, రమేశ్, నరేందర్, గంగన్న, కిషన్, సురేశ్, చంద్రయ్య, లచ్చన్న, ప్రభాకర్, రాజశేఖర్, కాంతారావు, పున్నం తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో మళ్లీ డిపార్ట్‌మెంటల్ సమావేశం

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రిలో మళ్లీ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ఇన్‌చార్జి జీఎం విజయప్రసాద్ మాట్లాడుతూ కంపెనీ ముందున్న లక్ష్యాలు, భవిష్యత్ ప్రణాళికలు, సవాళ్లను వివరించారు. ఉద్యోగులంతా సమష్టిగా నిబద్ధతతో పనిచేస్తేనే లక్ష్య సాధన సులువవుతుందన్నారు. ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి అక్బర్ అలీ, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీజీఎం ప్రసాద్, ఐఈడీ కిరణ్‌కుమార్, డీవైపీఎం వో ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


మదన్పూర్(ఫైల్)

జైపూర్/కరీంనగర్‌క్రైం: కరీంనగర్ బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్‌లో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి బాబుక్యాంప్‌కి చెందిన మహమ్మద్ మదన్పూర్ ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం వన్‌టౌన్ సీఐ రాంచందర్‌రావు, ఎస్సై రాజన్న వివరాలు వివరాలు వెల్లడించారు. బాలమ్మబీ కి చెందిన మహమ్మద్ సాదిక్‌పాషా చిన్న కొడుకు మహమ్మద్ మదన్పూర్ ఇంటర్ ఫెయిలయ్యాడు. కొన్నాళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ ఉద్యోగాలు, చిరు వ్యాపారాలు చేస్తూ నష్టపోయి అప్పుల పాలయ్యాడు. ఇంటికి వెళ్తున్నానని స్నేహితుడు నరేశ్‌కు చెప్పి కరీంనగర్‌లోని హోటల్‌లో ఉరేసుకున్నాడు. సాదిక్‌పాషా ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సేవారత్న అవార్డుకు కొండబాబు ఎంపిక


కొండబాబు

బెల్లంపల్లిరూరల్: రాష్ట్రస్థాయి సేవారత్న అవార్డు 2025కి బెల్లంపల్లికి చెందిన కూడి పూడి కొండబాబు ఎంపికయ్యారు. కొండబాబు నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవా సమితి స్వచ్ఛంద సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆయన చేసిన సేవలను గుర్తించి హైదరాబాద్‌కు చెందిన మదర్ ఫౌండేషన్, మెగాసిటీ నవకళావేదిక స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రతి ఏటా చేసిన రాష్ట్ర స్థాయి సేవారత్న 2025 అవార్డుకు ఎంపిక చేశారు.

మత్తడి కాలువకు మరమ్మతులెప్పుడో!

- ఏటా తెగి నీరంతా వృథా
- చెరువులు నిండక రైతుల తిప్పలు
- శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకోలు


చెరువులకు నీరందించే కాలువకు పడిన గండి

జన్నారం: మండలంలోని రాముని చెరువుకు నీరందించే మత్తడివాగు కాలువకు గండి పడడంతో నీరంతా వృథాగా పోతోంది. దీంతో గొలుసుకట్టు చెరువులు పెద్దకుంట, చిన్నకుంటలతో పాటు రాముని చెరువుకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నకుంట నిండితే ఆ నీరు పెద్దకుంటలోకి అక్కడి నుంచి రాముని చెరువులోకి చేరి అలుగు ద్వారా భర్తన్‌పేట్ చెరువులోకి అది నిండితే అలుగు ద్వారా గుడి వాగులోకి చేరుతుంది. కాని కాలువకు గండి పడడంతో చెరువులు ఇప్పటికీ నిండలేదు.

మూడు వాగులు కలిసే చోట..

కవ్వాల్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో మూడు వాగులు కలిసే చోట మత్తడి నిర్మించారు. మత్తడి వద్ద నీరు ఆగిపోవడం వల్ల ఆ నీటిని తూము ఏర్పాటు చేసి కాలువ ద్వారా కవ్వాల్ చెరువులోకి నీరు చేరేలా ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. పురాతన కాలంలో నిర్మించిన మట్టి కాలువకు ప్రతీ సంవత్సరం గండి పడి నీరంతా వృథాగా పోతుంది. రైతులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి పిచ్చి మొక్కలు, చెట్లను తొలగించి నీరు చెరువులోకి వచ్చేలా చూస్తారు. కానీ ఈ సంవత్సరం ఎప్పటిలాగే కాలువకు పలు చోట్ల గండి పడింది. ఈసారి పడిన గండంతో రైతులు ఐబీఎల జన్నారం ఇరిగేషన్ కార్యాలయం ఎదుట నిరసన చేసి, డీఈ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇచ్చారు. ఆయన స్పందించి తాత్కాలిక మరమ్మతుల కోసం రూ. 58 వేలు కేటాయించి ఇసుక సంచులతో కాలువకు మరమ్మతులు చేయించారు. ఇటీవల కురిసిన వానలకు చెరువు నిండాల్సి ఉన్నా కాలువ తెగిపోవడంతో నీరు ఇప్పటికీ చెరువులోకి చేరలేదు. కొన్ని సంవత్సరాలుగా ఈ కాలువను సిమెంట్‌తో నిర్మించాలని ప్రజాప్రతినిధులను, అధికారులను వేడుకుంటున్నా స్పందన కరువైంది. కాలువ గండికి తాత్కాలిక మరమ్మతులు చేసినా ఫలితం లేకపోవడంతో శాశ్వత పరిష్కారానికి ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని హామీ ఇచ్చారు.

సిమెంట్‌తో నిర్మించాలి



మత్తడి వాగు నుంచి చెరువుకు వచ్చే కాలువను సిమెంట్‌తో నిర్మిస్తేనే ఫలితం ఉంటుంది. తాత్కాలికంగా మట్టితోనో, ఇసుకతోనో కడితే ఎప్పటిలాగే తెగిపోతుంది. అధికారులు స్పందించి సిమెంట్‌తో కాలువ నిర్మించాలి. – మహమూద్ అలీఖాన్, రైతు, కవ్వాల్

శాశ్వత పరిష్కారం చూపాలి



రాముని చెరువును నమ్ముకునే పంటలు వేసుకుంటున్నాం. వర్షం నీటితో నిండే చెరువుకు మత్తడి నీరే ఆధారం. మత్తడి వాగు నుంచి నీరు చెరువులోకి వచ్చేలా శాశ్వత పనులు జరిపించాలి. – రంగు వెంకటేశ్, రైతు, కవ్వాల్

ప్రతిపాదనలు పూర్తయ్యాయి

ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులకు రూ.58వేలు కేటాయించి ప్రతిపాదనలు పూర్తి చేశాం. రెండు రోజుల్లో టెండర్లు కూడ పూర్తవుతాయి. అనంతరం పని ప్రారంభిస్తాం. కాలువకు శాశ్వత నిర్మాణం కోసం కూడ ప్రతిపాదనలు తయారు చేస్తాం. – వెంకటేశం, డీఈఈ, ఇరిగేషన్

యూరియా కోసం రైతుల తిప్పలు


చెన్నూర్‌లో ఎరువుల కోసం బారులుతీరిన రైతులు

చెన్నూర్: మండల రైతులు ఎరువుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయాధికారులు, సహకార సంఘం అధికారుల మధ్య సమన్వయ లోపంతో రైతులు కష్టాలు పడుతున్నారు. చెన్నూర్ పట్టణంలోని వ్యవసాయ సహకార సంఘ భవనం వద్ద యూరియా పంపిణీ చేస్తున్నారనే సమాచారం మేరకు శుక్రవారం రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గోదాంలో 444 ఎరువుల బస్తాలు ఉండడంతో కొందరు రైతులు గోదాం లోనికి చొచ్చుకొని వచ్చి షట్టర్ వేసుకున్నారు. గోదాము బయట ఉన్న రైతులు ఆందోళన చేశారు. రైతుల ఆందోళనను గమనించిన పీఏసీఎస్ సిబ్బంది గోదాం నుంచి బయటకు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రైతులకు సర్దిచెప్పారు. అనంతరం గోదాం షట్టర్ పైకి ఎత్తి వరుస క్రమంలో రైతులకు ఎరువులు పంపిణీ చేశారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్


భీమారం: పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు

మంచిర్యాలక్రైం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు శుక్రవారం నిర్వహించ తలపెట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమం నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు అమీరిశెట్టి, రాజ్‌కుమార్, ఆంజనేయులు, మల్లికార్జున్, హరికృష్ణ, శ్రీనివాస్, సత్యనారాయణ, పవన్ ఉన్నారు.

బెల్లంపల్లిరూరల్: బీజేపీ నాయకులను తాళ్లగురిజాల పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సేవ్ హైదరాబాద్, తెలంగాణ పేరుతో చలో సచివాలయం కార్యక్రమానికి ఇచ్చిన పిలుపు మేరకు మండల బీజేపీ నాయకులు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రధానకార్యదర్శులు రామన్న, నరేష్, కార్యదర్శి సాయి, నాయకులు ఉన్నారు.

భీమారం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తలపెట్టిన చలో సచివాలయం కార్యక్రమానికి వెళ్లకుండా శుక్రవారం మండల బీజేపీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండల పార్టీ అధ్యక్షుడు బోర్లకుంట శంకర్, ప్రధాన కార్యదర్శి మడె శ్రీనివాస్, నాయకులు వేల్పుల రాజేశ్, సెగ్గెం మల్లేశ్ ఉన్నారు.

చెన్నూర్: రాష్ట్రంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోరుతూ అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వగా నేపథ్యంలో మండల బీజేపీ నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. వారిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పార్టీ అధ్యక్షుడు అంగలి శేఖర్, మాజీ అధ్యక్షుడు శైలేందర్‌సింగ్ ఉన్నారు.

కాసిపేట: బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టులు హేయమైన చర్య అని బీజేపీ మండలాధ్యక్షుడు సూరం సంపత్ కుమార్ అన్నారు. శుక్రవారం కాసిపేట, దేవాపూర్ పోలీస్ స్టేషన్‌లలో బీజేపీ మండలాధ్యక్షుడితో పాటు మండల కార్యదర్శి రెడ్డి బాలరాజు, ఉపాధ్యక్షుడు బోల్కొండ శ్రీనివాస్, దోమల రాంచందర్, విష్ణు వర్ధన్‌ను ముందస్తుగా అరెస్ట్ చేశారు.

ఘనంగా పనుల జాతర


తాండూర్: మాదారం 3 ఇంక్లైన్‌లో జీపీకి భూమిపూజ చేస్తున్న అధికారులు

తాండూర్: తెలంగాణ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనుల జాతర కార్యక్రమాలను మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. మండలంలోని గోపాల్‌నగర్‌లో అంగన్‌వాడీ భవనం, కాసిపేట మాదారం 3 ఇంక్లైన్‌లో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణాలతో పాటు మిగతా గ్రామపంచాయతీల్లో ఆవుల షెడ్లు, ఇంకుడు గుంతలతో పాటు పలు రకాల నూతన పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు.

మందమర్రిరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని గ్రామాల్లో శుక్రవారం ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న పనులకు సంబంధించిన ప్రారంభోత్సవాల జాతర జరిపారు. ఉపాధిహామీ కింద చేపడుతున్న 15 పనులకు సంబంధించి రూ.65 లక్షల విలువ గల పనులను ప్రారంభించారు.

మందమర్రిరూరల్: మందమర్రి మండలంలోని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఉపాధి పనుల జాతర కార్యక్రమం నిర్వహించారు. పలు గ్రామాల్లో ఎంపీడీవో రాజేశ్వర్, ఈజీఎస్‌పీవో రజియా సుల్తానాతో కలిసి పలు కొత్త పనులను ప్రారంభించారు. ప్రతీ గ్రామ పంచాయతీలో ఉత్తమ కూలీని ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి


మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రహ్మానందం డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ సివిల్ కార్యాలయంలో శుక్రవారం గేట్‌మీటింగ్ నిర్వహించారు. కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ నిర్దేశించిన వేతనాలను కోలిండియాలో అమలు చేస్తుండగా సింగరేణిలో మాత్రం అమలు చేయడం లేదన్నారు. చాలీచాలని వేతనాలతో కాంట్రాక్ట్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై వచ్చే నెల 7న హైదరాబాద్‌లో సమ్మె నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని కోరారు. నాయకులు మల్లేష్, వెంకటేశ్, శివ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత విగ్రహం లభ్యం


లభ్యమైన దుర్గామాత విగ్రహం

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఆర్‌కే1 మార్కెట్ ప్రాంతంలో దుర్గామాతను ప్రతిష్టించే మండపం ఆవరణలోని ఓ పుట్టలో శుక్రవారం దుర్గామాత విగ్రహం లభ్యమైంది. అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళకు దేవుడు కలలోకి వచ్చి మండపం వెనుకాల అమ్మవారు ఉన్నట్లు చెప్పడంతో స్థానికులు అక్కడ తవ్వకం జరిపి దుర్గామాత విగ్రహాన్ని బయటకు తీశారు. విగ్రహం లభ్యమైన విషయం తెలిసి స్థానికులు పెద్దఎత్తున తరలివచ్చారు. సమీపంలోని హనుమాన్ ఆలయంలో విగ్రహాన్ని ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

ఆదివాసీ గూడేల్లో సమస్యలు పరిష్కరించాలి

తాండూర్: ఆదివాసీ గూడేల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని నర్సాపూర్, లమ్మగూడెం వాగులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో శ్రీనివాస్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, మండల కార్యదర్శి దాగం రాజారాంలు మాట్లాడుతూ వాగులపై వెంటనే వంతెన నిర్మాణం లు నిర్మించాలన్నారు. నాయకులు రాజేశం, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

గనిలో సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్: ఎస్ఆర్‌పీ–3గనిలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన గనిని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు బద్రి బుచ్చయ్య, అడ్డు శ్రీనివాస్, పిట్ కార్యదర్శి మారేటి చౌదరి, నాయకులు అంజాల రవి, తవటం మల్లేష్, శ్రీకాంత్ రాచర్ల, రవీందర్ పాల్గొన్నారు.

'యూరియా అతిగా వాడొద్దు'


అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సురేఖ

చెన్నూర్: రైతులు వరి, పత్తి పంటలకు యూరియాను అతిగా వాడొద్దని, వాడితే చీడపీడల ఉధృతి పెరుగుతుందని ఏడీఏ సురేఖ అన్నారు. శుక్రవారం నెన్నెలలో ఆమె ఏవో సృజనతో కలిసి క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. యూరియాను ఎకరాకు ఒక బస్తాకే వాడాలని సూచించారు. యూరియాతో పాటు ఇతర ఎరువులు దఫదఫాలుగా వేసుకోవడం ద్వారా మొక్కలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆమె వెంట ఏఈవో రాంచందర్, రైతులు ఉన్నారు.

• **'బంద్ విజయవంతం చేయండి'**

కోటపల్లి: ఈనెల 23న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా తపస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న బంద్‌ను ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు సయిండ్ల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని దేవులవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీపీఎస్ రద్దు చేయాలనే బలమైన ఉద్దేశంతో బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

• **బీజేపీ ఆధ్వర్యంలో సన్మానం**

జన్నారం: మండల సామాజికవేత్త శ్రీరాముల భూమాచారి, బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బద్దినేవాత్‌ను శుక్రవారం బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేశ్ రాథోడ్ మాట్లాడుతూ మండల కేంద్రంలో భారీ వాహనాల్లో నిషేధం ఎత్తివేయాలని వీరు చేసిన కృషిని కొనియాడారు. పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవన్ యాదవ్, కవ్వాల్ శక్తి కేంద్రం ఇన్‌చార్జి సదాసింగ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

• **సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి**

వేమనపల్లి: భారీ వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి అస్మిత్ అన్నారు. మండలంలోని మంగెనపల్లి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి రోగులకు మందులు అందజేశారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు, జ్వరపీడితుల రక్తనమూనాలు సేకరించారు. హెల్త్ సూపర్‌వైజర్ ఆప రంజి, హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, పంచాయతీ కార్యదర్శి శ్యామల పాల్గొన్నారు.

• **కేజీబీవీలో వైద్య శిబిరం**

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ నర్సింగరావు పుట్టినరోజు పురస్కరించుకుని వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు అంజయ్య, అనూషలు కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

• **కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలి**

వేమనపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాదారులు కేవైసీని అప్‌డేట్ చేయించుకోవాలని బ్రాంచి మేనేజర్ వేణుగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు బ్యాంకు సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండాలంటే ఖాతాదారులు తమ ఆధార్, పాన్‌కార్డు, ఫొటోతో బ్యాంకుకు వచ్చి సెప్టెంబర్ 30లోపు కేవైసీ చేయించుకోవాలన్నారు.

సంక్షిప్త వార్తలు

నస్పూర్: పట్టణ పరిధిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు సీతారాంపల్లి శాఖ ఖాతాదారులు తమ బ్యాంకు ఖాతాలను తప్పనిసరిగా కేవైసీ చేయించుకోవాలని బ్యాంకు మేనేజర్ నర్సింహాస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

• **నీల్వాయిలో 'ఘర్ ఘర్ బీజేపీ'**

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆధ్వర్యంలో ఘర్ ఘర్ బీజేపీ హర్ హర్ బీజేపీ కార్యక్రమం లో భాగంగా నీల్వాయిలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి చరణ్, నాయకులు రమేశ్‌గౌడ్, మధునయ్య, కిషోర్, కిరణ్ స్వామి పాల్గొన్నారు.

• **అభివృద్ధి పనులకు భూమిపూజ**

వేమనపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌అలీలు శుక్రవారం భూమిపూజ చేశారు. కొత్తగూడలో రూ.12 లక్షలతో అంగన్‌వాడీ బిల్డింగ్, రూ.లక్షతో పశువుల పాక, వేమనపల్లిలో రూ.3 లక్షలతో కమ్యూనిటీ టాయిలెట్స్, మంగెనపల్లి ప్రాథమిక పాఠశాల, సూరారం పాఠశాలల్లో రూ.8 లక్షల చొప్పున ప్రహరీ గోడ నిర్మాణ పనులకు భూమిపూజ

భీమిని: ప్రజాపాలనలో భాగంగా కన్నెపల్లి, భీమిని మండలాల్లో శుక్రవారం ఎమ్మెల్యే వినోద్ ఆదేశాలతో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాసరావు అధికారులతో కలిసి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కన్నెపల్లి మండలంలోని ఎల్లారం అంగన్‌వాడీ భవన సామాజిక మరుగుదొడ్లు, ముత్తాపూర్‌లో పంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. కన్నెపల్లి, భీమిని మండలాల్లో పాఠశాలల ప్రహరీలను ప్రారంభించారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, గంగామోహన్, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, రాజేశ్‌కృష్ణ, చంద్రయ్య, సుధీర్ గౌడ్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

• **బీసీలు ఐక్యతతో ముందుకు సాగాలి**

నస్పూర్: రాబోయే కాలంలో బీసీలకు రాజ్యాధికారం రావాలంటే బీసీలు ఐక్యతతో ముందుకు సాగాలని తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ జిల్లా ఇన్‌చార్జి మహేశ్ వర్మ కోరారు. శుక్రవారం నాయకులతో కలిసి నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 20న జిల్లా కేంద్రంలో నిర్వహించిన బహుజనుల రాజ్యాధికారములో నేను సైతం సభ విజయవంతం కావడం పట్ల పార్టీలకు చెందిన బహుజనుల నాయకులు కృతజ్ఞతలు చెప్పాలన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు బీసీ వాదాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ ప్రయోజనాలు పొందాలనుకుంటున్నాయని ఆరోపించారు. నాయకులు దాసస్థు దీపక్, పొలాల దినకర్, పడాల శివ తేజ, ఉలిక్ తదితరులు పాల్గొన్నారు.

• **భక్తిశ్రద్ధలతో ఏకాహం**

భీమారం: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో 24 గంటలపాటు భజనతోపాటు పారాయణం నిర్వహించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలనే ఉద్దేశంతో అఖండభజన (ఏకాహం) నిర్వహించామని సాయిరాం యూత్ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కాగా ఏకాహం అనంతరం స్వామి వారి శోభాయాత్ర నిర్వహించారు.

• **రేషన్ డీలర్ల ముందస్తు అరెస్ట్**

నస్పూర్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు, ధర్నా చౌక్ వద్ద చేపట్టిన మెరుపు ధర్నాకు వెళ్తున్న పట్టణ రేషన్ డీలర్లను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రవి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఐదు నెలల కమీషన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. డీలర్లు అశోక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

• **ఈద్గా వద్ద వీధి దీపాలు ఏర్పాటు చేయాలి**

మందమర్రిరూరల్: పట్టణంలోని సింగరేణి హైస్కూల్ వెనుక వైపు గల ఈద్గా వద్ద వీధి దీపాలు వెలుగక పోవడంతో ఇబ్బంది కలుగుతుందని, వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగుకు వినతిపత్రం అందించారు.

• **హైకోర్టు జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్**

మంచిర్యాలక్రైం: హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ హైకోర్టు న్యాయమూర్తి నగేష్ భీమపాక్‌ను జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరం జగన్, సభ్యులు హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

జాబ్‌మేళాకు అనూహ్య స్పందన

పాతమంచిర్యాల: నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని జిల్లా ఉపాధికల్పన అధికారి రవి కృష్ణ, మిమ్స్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో ఉపాధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో శ్రీ ఆర్యవర్ధ ఇన్‌ఫోటెక్ స్టాఫింగ్ కంపెనీ ప్రతినిధులు జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాలో 100 ప్రోగ్రామర్ పోస్టులకు గాను 75 మంది హాజరవ్వగా 27 మందిని ఎంపిక చేశారు. శ్రీ ఆర్యవర్ధ ఇన్‌ఫోటెక్ ప్రతినిధులు రాంకుమార్, శ్రీనివాస్, వెంకటరమణ పాల్గొన్నారు.

నస్పూర్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్‌లో గల స్మృతి ఇన్‌స్టిట్యూట్, సమగ్రయం విద్యాలయం సేవా సంస్థ ఆధ్వర్యంలో సీసీసీలోని స్మృతి ఇన్‌స్టిట్యూట్‌లో హైదరాబాద్‌లోని ప్రముఖ కంపెనీల నిర్వహించిన జాబ్‌మేళాకు అనూహ్య స్పందన వచ్చినట్లు ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేంద్ర పాణి, పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. 150 మంది మేళాకు హాజరవ్వగా 30మందికి ఆఫర్ లెటర్స్ ఇచ్చినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. రాజకుమార్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు పంటల పరిశీలన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దండె విఠల్

భీమిని: మండలంలోని చిన్న తిమ్మాపూర్ గ్రామ పరిధిలో వర్షాలకు ముంపునకు గురైన పంటలను శుక్రవారం ఎమ్మెల్సీ దండె విఠల్ పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నతిమ్మాపూర్ గ్రామస్తులు గ్రామానికి సంబంధించిన భూ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. చిన్నతిమ్మాపూర్, తంగళ్లపల్లి గ్రామాల మధ్య ఎర్రవాగుపై శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. మాజీ సర్పంచ్ ఇందారి భూమయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొలాల అమావాస్య వేడుకలు


ఎడ్లకు పూజ చేస్తున్న ఉపాధ్యాయులు

దండేపల్లి: మండలంలోని గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పొలాల అమావాస్య వేడుకలు నిర్వహించారు. ఎడ్లను పూజించి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం బుచ్చన్న పొలాల అమావాస్య వేడుకలపై విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయురాలు శ్యామల ఉన్నారు.